# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హామీలు-వాటి అమలు తీరు

ఈ సంవత్సరం ఏప్రిల్ 11న ఆంధ్రప్రదేశ్ లోని లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, బిజెపితో జట్టుకట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత అది ప్రజలకు చేసిన వాగ్దానాలు, వాటి అమలుతీరును విశ్లేషించాలి.

2019 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశంపార్టీ రెండే రెండు విషయాల చుట్టూ తమ ప్రచారాన్ని తిప్పాయి. ఒకటి రాజధాని ప్రాంత అభివృద్ధి, రెండు పోలవరం ప్రాజెక్టు. వ్యవసాయరంగ సంక్షోభం గురించి, పారిశ్రామికంగా వెనుకబడటం గురించి చంద్రబాబు చాలా తక్కువగా మాట్లాడాడు. అతను పూర్తిగా దృష్టి పెట్టింది ప్రజాకర్షక పథకాలపైనే.

**పంట రుణాల రద్దు**

24000 కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు రద్దుచేస్తానని ఇచ్చిన హామీలో ఈ 4, 5 సంవత్సరాలలో కేవలం 15,147 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వం సర్దుబాటు చేయగలిగింది. ఇంకా 9000 కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు రద్దుచేయవలసిన బకాయిలుగానే వున్నాయి. టిడిపి ప్రభుత్వం 58.29 లక్షల రైతులకు లబ్ధిచేకూర్చానని ప్రకటించుకొంటోంది. అందులో ఉద్యానవన సాగుదారులు కూడా వున్నారు. 50,000 రూ.లోపు రుణాలు తొలిదశలోనే చెల్లించినా, ఎక్కువ అప్పులున్న రైతులకు విడతలు విడతలుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. దీనివల్ల ఆ రైతులంతా బ్యాంకుల డిఫాల్టర్ల లిస్టులోకి చేర్చబడ్డారు. అంటే పాత రుణం రద్దుకాకుండా వడ్డీతో సహా తిరగరాయబడి అనేకమంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తెలుగుదేశం ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించటంలో ఘోరంగా విఫలమైంది.

రాష్ట్రంలో 32 లక్షలమంది కౌలుదారులు వుండగా, వారిలో ఎక్కువమంది ఎస్.సి., ఎస్.టి., బి.సి.లు మరియు గ్రామీణ పేదలు. 80% నీటి పారుదల గల భూమిని కౌలుదారులే సాగుచేస్తున్నారు. వారే అధిక భాగాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న రుణాలుగానీ, సబ్సిడీలుగానీ, రుణాలకోసం జారీచేసే కార్డులుగానీ, బీమా పథకాలుగానీ వారికేమీ చేరటంలేదు. కనీసం ఎన్నికల సందర్భంగా కూడా వారికవి అందలేదు. ఎందుకంటే వారు సాగుచేస్తున్న భూములకు వారు యజమానులు కారు.

రైతులకు సాగుకయ్యే ఖర్చు (మిరప, పొగాకు, పత్తి, వేరుశెనగ, సుబాబుల్ మొ॥) 30 వేలనుండి 35 వేల రూపాయలు ఒక ఎకరానికి ఖర్చవుతుంటే రాష్ట్రప్రభుత్వం 9వేలు, కేంద్రప్రభుత్వం 6 వేలు పెట్టుబడిసాయంగా ప్రకటించటం రైతులను హేళన చేయటమే. ఈ 5 సం॥ల కాలంలో పెట్టుబడిదారులు రైతాంగాన్ని దోపిడీ చేయటానికి, వ్యవసాయాన్ని నాశనం చేయటానికి, రైతులు అప్పుల్లో కూరుకు పోవటానికి, అంతిమంగా ఆత్మహత్యలకు పాల్పడటానికి ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేసింది.

**భూసంస్కరణలు, వ్యవసాయ సంస్కరణలు**

1996లో ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ భారత పాలకులకిచ్చిన ఆదేశాలమేరకు 40 కోట్ల గ్రామీణ ప్రాంత ప్రజానీకం 20 సం॥కాలంలో పట్టణాలకు, నగరాలకు వలసవెళ్ళారు. ఎంతో విలువైన భూములు అసమర్ధులైన రైతుల చేతుల్లో వుండిపోయాయని, వారిని ఆ భూముల నుండి తొలగించి వలస కార్మికులుగా మార్చమని అవి ఆదేశించాయి. చిన్న కమతాల స్థానే కాంట్రాక్టు కార్పొరేట్ వ్యవసాయం రావాలన్న సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల ఆదేశాలను భారత పాలకులు తుచ తప్పక పాటిస్తున్నారు.

మన పాలకులు, సెజ్జులను, పారిశ్రామిక కారిడార్లను, ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటుచేస్తూ, వాటికొరకు ప్రభుత్వ భూములను, ప్రైవేటు భూములను, అస్సైన్డ్ భూములను గుంజుకుంటూ సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థల ఆదేశాలను పాటిస్తున్నారు. దేశ మంతటా భూసేకరణను పెద్దఎత్తున చేపట్టారు. పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఇందుకు ఉపయోగిస్తున్నారు. ఈ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజలు అనేకచోట్ల ప్రతిఘ టించారు. ఈ ప్రతిఘటనలను నిలువరించటం కోసం అప్పటి యుపిఏ ప్రభుత్వం తన చివరి పాలనా సంవత్సరంలో ‘భూసేకరణ చట్టం 2013’ను తీసుకువచ్చింది. దీనిలో ప్రజలకు కొంతైనా రక్షణ కల్పించే అంశాలను రద్దుచేసి చంద్రబాబు ప్రభుత్వం కొత్త భూసేకరణ విధానాన్ని తీసుకువచ్చింది. అది భూసేకరణ చట్టం-2013 కంటే మెరుగైనదని చెప్పుకుంటూ పెద్దఎత్తున భూసమీకరణకు శ్రీకారం చుట్టింది. గత కాంగ్రెసు ప్రభుత్వం 1.27 లక్షల ఎకరాలను సేకరించి సెజ్జులకొరకు పెట్టుబడిదారుల కిచ్చింది. వాన్‌పిక్, కోస్టల్‌కారిడార్, కాకినాడసెజ్ మొదలగు వాటికోసం వైయస్సార్ హయాంలో భూమిని సేకరించటం జరిగింది. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఆయా పెండింగు ప్రాజెక్టులకోసం భూమిని సేకరించటం ఆపలేదు సరికదా, దానిని ఇంకా విస్తృతంగా అన్ని జిల్లాలకు వ్యాప్తి చేసింది. గత 5 సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా భూబ్యాంకుల కొరకు 30 లక్షల ఎకరాలు సమీకరించాలని, ఒక్కో జిల్లాకు 2 లక్షల ఎకరాలకు తగ్గకుండా సమీకరణ జరగాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. వివిధ జిల్లాలలో సమీకరించబడిన ఈ భూమిలో ఎక్కువభాగం ఎస్సైన్‌మెంటు భూమి కాగా, ఆ భూమి పేదవాళ్ళకు చెందినదిగా వుంది.

చిన్నకమతాల నుండి వచ్చే ఉత్పత్తి ఇంకా గ్రామీణ ఆర్థికంలో కీలకమైనదిగానే వుంది. వ్యవసాయానికి ఇవ్వాల్సిన సబ్సిడీలను తగ్గించేయటం ఫలితంగా పంట దిగుబడుల ఉత్పత్తి ఖర్చును రోజురోజుకూ ప్రభుత్వాలు పెంచివేస్తున్నాయి. పంట కొనుగోళ్ళలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్రను నానాటికీ తగ్గిస్తూ మార్కెట్లో కనీస మద్దతు ధరను కూడా వాటికి లభించకుండా చేస్తున్నాయి. కూలి ఖర్చులైనా వస్తాయో రావోననే భయం రైతాంగాన్ని వెన్నాడు తోంది. దేశ ప్రజానీకానికంతా ఆహారభద్రతను కల్పిస్తున్న అన్నదాతలు అర్థాకలితో వుంటున్నారు. ఈ చిన్నకమతాలు సాగుచేస్తున్న కౌలుదార్లను మరింత బలహీనపరచి, వారిని భూమిని వెళ్ళ గొట్టేలా చేయటమన్నది ప్రస్తుతం పెట్టుబడి దారుల లక్ష్యంగా వుంది.

గ్రామీణ ప్రాంతంలో భూకేంద్రీకరణ బాగా పెరిగింది. రిజర్వుభూములు, రిజర్వు అటవీ భూములు కొత్త రూపాన్ని సంతరించు కుంటున్నాయి. ఆర్గానిక్ వ్యవసాయం, ఔషధ మొక్కల పెంపకం, జీడిపప్పు, నీలగిరి, మలబారు, ఎర్రచందనం, శ్రీగంధ మొదలగు మొక్కల పెంపక కేంద్రాల పేరుతో వందలాది ఎకరాల కమతాలు ఏర్పడుతూ, ఇంకా విస్తృతమవుతున్నాయి. నల్లధన కుబేరులు, అక్రమ మార్గాల ద్వారా డబ్బు పోగుచేసుకున్న అధికారపార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వాధికారులు ఈ భూముల కొనుగోళ్ళకు మళ్ళుతున్నారు. మరోవైపు గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వ భూములు, వనరులు(ఇసుక, మట్టి, గ్రానైటు, బంజర్లు, ఎస్సైన్డు భూములు, చెరువులు, కుంటలు మొదలగునవి) అధికార పార్టీ అండతో, నిస్సిగ్గుగా కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రత్యక్ష జోక్యంతో నిరాటంకంగా లూటీ చేస్తున్నారు.

వెనక్కి వెళ్ళి చూస్తే 1996లో దేశ వ్యాప్తంగా భూరికార్డుల కంప్యూటరీకరణ కొరకు ప్రపంచబ్యాంకు నిధులను సమకూర్చింది. ఇప్పుడు ప్రభుత్వం కంప్యూటర్‌లో నిక్షిప్తమై వున్న 1-బి అడంగల్‌నే భూమిని అమ్మటానికిగాని, కొనటానికిగాని, బ్యాంకులో లోనుపొందటానికి గాని, భూమిపై యాజమాన్యపు హక్కుకుగాని ప్రామాణికంగా చేశారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా కంప్యూటరీకరణ చేసిన 1-బి అడంగల్‌కే అన్ని అధికారాలను దఖలు పరిచారు. ఎటువంటి పట్టాలు పొందకుండా తరాలతరబడి సాగుచేసు కుంటున్న తమ భూములపై బడుగు, బలహీన వర్గాలకు తమ భూములపై ఎటువంటి అధికారం, హక్కు లేకుండా పోయాయి. కంప్యూ టరీకరించబడిన 1-బి ఉద్దేశం, వీరందరికీ భూములపైగల అనుభవ, సాంప్రదాయక హక్కులను రద్దుచేయటమే. ఈ 1-బి కంప్యూటరీకరణ వెనుకవున్న అసలు సూత్రధారి ప్రపంచబ్యాంకే. చంద్రబాబులాంటి హైటెక్ ఏజెంట్లు, భూమిని ఇట్లా కబ్జా చేయటానికి టెక్నాలజీని ఉపయోగించటంలో అందరికంటే ముందుంటారు. ఇలాంటి విషయాల్లో అపఖ్యాతి పొందిన అనుభవం చంద్రబాబుకుంది. రాజకీయంగా, సామాజికంగా ఆధిపత్యంలో వున్న వర్గాలు కూడా చట్టవిరుద్ధమైన పద్ధతుల ద్వారా, అనైతిక పద్ధతులద్వారా భూకబ్జాలకు పాల్పడుతున్నారు.

**పరిశ్రమలు-కార్మికులు**

గత ప్రభుత్వం సెజ్‌లకోసం కేటాయించిన భూముల్లో ఇంకా పనిమొదలు పెట్టని వాటిని, అక్రమ కేటాయింపులు జరిపిన వాటిని వెనక్కు తీసుకుంటామని, వాటిల్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన వాటిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని 2014 ఎన్నికల ప్రణాళికలో తెలుగుదేశం పార్టీ పేర్కొంది.

సోంపేటలో, కాకరాపల్లిలో థర్మల్‌ప్లాంట్లు పెట్టటానికి శ్రీకాకుళంజిల్లా కోస్తా ప్రాంతంలో వేలాది ఎకరాల భూ సేకరణకు వ్యతిరేకంగా ప్రజలనుండి నిరంతరాయమైన ప్రతిఘటన ఎదురైన అనంతరం, ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపివేస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఇంకా ఆ భూములు మాత్రం తిరిగి ప్రజలకు అప్పగించలేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజన అనంతరం విశాఖపట్నం ఒక్కటే పరిశ్రమలకు కేంద్రంగా వుంది. గుంటూరుజిల్లాలోని పత్తి మిల్లులు, జిన్నింగు మిల్లులు, గరివిడిలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు నష్టాల అంచుల్లో మూసివేతకు సిద్ధంగా వున్నాయి. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పేరుగాంచిన జనపనార పరిశ్రమ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా తీవ్ర యిబ్బందుల్లో వుంది. ఉత్తరాంధ్రలో 25 నుండి 30 మిల్లులను మూసివేసినా, చంద్రబాబు ప్రభుత్వం తన పాలనాకాలంలో ఏనాడూ వాటిని తెరిపించే ప్రయత్నం చేయలేదు. అదేవిధంగా ప్రభుత్వం వ్యవసాయాధారిత పరిశ్రమల విషయలంలో ప్రత్యేకించి చక్కెరమిల్లులు, సహకార చక్కెర మిల్లుల విషయంలో ఏమాత్రం బాధ్యతగా వ్యవహరించలేదు.

గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఒకనాడు కొన్నైనా ఉద్యోగావకాశాలను కల్పించిన ఈ పరిశ్రమలు ప్రస్తుతం కునారిల్లుతున్నాయి. ఈ పరిస్థితిలో కూడా చంద్రబాబు ప్రభుత్వం వీటిని పునరుద్ధరించటానికి ఏ ప్రయత్నాలూ చేయలేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన ఆక్వా, పౌల్ట్రీ, పాడి మొదలగు వాటిని రక్షించటానికి కూడా చంద్రబాబు ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోలేదు. పామాయిల్, తవుడు నూనె మిల్లులను గుత్తకంపెనీల నుండి రక్షించే చర్యలేమీ చేపట్టలేదు. ఇంకా క్వారీలు, గ్రానైట్, క్రషర్స్‌వంటి మధ్యతరహా పరిశ్రమలలో గుత్తపెట్టుబడుల చొరబాటును నిరోధించటానికి బదులు, కార్మికులకు ఉద్యోగితను కల్పించటానికి బదులు బడాకార్పోరేట్లకే ప్రోత్సాహకాల నిస్తున్నారు.

**ప్రజాకర్షక పథకాలు**

రాష్ట్ర విభజనానంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అభివృద్ధికి నమూనాగా మౌలిక వసతుల ప్రాజెక్టులను చూపించటంలో తలమునకలై వుంది. ప్రతిజిల్లాకు ఒక విమానాశ్రయాన్ని, ప్రతి కోస్తాజిల్లాకు ఒక పోర్టును నిర్మిస్తానని, వాటిని రాజధాని ప్రాంతానికి అనుసంధానించే రోడ్ల నిర్మాణం గురించి ముఖ్యమంత్రి పదేపదే ప్రస్తావిస్తున్నాడు. ఇదంతా తలకిందుల వ్యవహారం తప్ప మరోటి కాదు. మౌలిక వసతుల ప్రాజెక్టులు ఎగుమతి చేయగల వస్తువులను ఉత్పత్తి చేయటంగానీ, దిగుమతులకు మార్కెట్లను కల్పించటంగానీ చేయలేదు. పరిశ్రమలను అభివృద్ధిచేయకుండా చేసే మౌలిక వసతుల నిర్మాణం నిరుపయోగమైనది.

రోడ్డురవాణాలో దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థ, ఏపిఎస్ఆర్‌టిసికి చెందిన నిధులను ప్రభుత్వము, కొంతమంది ఉన్నతాధికారులు చట్టవిరుద్ధంగా దారి మళ్ళించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని పణంగాపెట్టి వారు ప్రైవేటు రవాణా యాజమాన్యాలతో అసంబద్ధమైన ఒప్పందాలు చేసుకుని ఏపిఎస్ఆర్‌టిసిని నాశనం చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువచేసే సంస్థ ఆస్తులను అత్యంత చవగ్గా తమ బంధుగణానికి, అనుయాయులకు కట్టబెడుతున్నారు.

ఇంతగా భూములు సేకరించినప్పటికీ ఏ జిల్లాలోనూ 10% పరిశ్రమలు కూడా ఇంత వరకు రాలేదు. మరి ఎందుకు ఇంతభూమిని సేకరించినట్లు? సుప్రీంకోర్టు, పార్లమెంటు కమిటీ, కాగ్‌లు సెజ్‌లకోసం చేసిన భూకేటా యింపులను పరిశీలించి నివేదికలిచ్చాయి. సెజ్‌లకు సంబంధించి కాగ్ లోతైన పరిశీలనా నివేదికను ఇచ్చింది. సెజ్‌లకు కేటాయించిన భూములను, వాటి యజమానులు స్వంత ఎస్టేట్లుగా వాడుకుంటున్నారని అది స్పష్టంగా పేర్కొంది. సెజ్‌లకోసం కేటాయించిన భూమిలో 90% ఖాళీగా వుందని పేర్కొంది. అయినా చంద్రబాబు ప్రభుత్వం మాత్రం సెజ్‌లనుండి నిర్దిష్ట ఫలితాలేమీ లేకున్నప్పటికీ వందలకోట్ల

రూపాల విలువజేసే భూములను సెజ్‌లకు కేటాయింపులు జరిపి దానినే పరిశ్రమల స్థాపనగా పదేపదే చెబుతున్నాడు. ఒకటి మాత్రం స్పష్టం. పరిశ్రమల అభివృద్ధి అనేది వందలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేసే దావోస్(ప్రపంచ ఆర్థిక వేదిక) ప్రయాణాల వలనగానీ, విశాఖపట్నంలో జరిపిన ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య సదస్సులవలనగానీ జరిగేది కాదు.

**కుదేలైన చిన్న పరిశ్రమలు**

దళారీ పెట్టుబడిదారులతో గుత్తపెట్టుబడి దారులతో పోటీపడలేక ఈడ్చుకుంటూ వస్తున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలన్నీ జిఎస్టీని అమలుచేయటంతో పూర్తిగా కుదేలైపోయాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను కాపాడు కోవటంద్వారా స్థానిక మార్కెట్లను నిలబెట్టు కోగలుగుతాం. శ్రామికులకు పని కల్పించ గలుగుతాం, గ్రామీణ చేతివృత్తులకు మార్కెట్లకు కల్పించగలుగుతాం.

జాతీయ పెట్టుబడి, వ్యవసాయాధారిత పరిశ్రమలు, చిన్న మధ్యతరహా పరిశ్రమలు మనుగడ సాగించటానికి, అభివృద్ధిచెందటానికి అంతర్జాతీయ పెట్టుబడి మరియు దళారీ గుత్తపెట్టుబడిశక్తులు అవరోధంగా వున్నాయి. ఏ దేశానికైనా గుత్తపెట్టుబడి శక్తులను ఎదుర్కోవాలనే కాంక్ష రాజకీయంగా లేకపోతే, ఆ దేశం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందజాలదని మన అనుభవం తెలియజేస్తోంది. జాతీయ పెట్టుబడిని కాపాడే విధానాలు మాత్రమే స్థానిక మార్కెట్లను అభివృద్ధిచేయగలవు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచగలవు, తద్వారా పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది.

మన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కబళిస్తూ, మన ప్రజల రక్తమాంసాలను జలగల్లా పీలుస్తున్న అంతర్జాతీయ పెట్టుబడికి, దళారీ పెట్టుబడికి, ఫ్యూడల్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి రైతాంగము, శ్రామిక వర్గము-ప్రజాస్వామిక, దేశభక్తియుత, విప్లవ శక్తులతో ఏకం కావాలి. మనముందున్న కర్తవ్యం ఇదే.

**విద్య**

ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్యవరకు ప్రైవేటీకరణ కబంధ హస్తాలలో ఇరుక్కుపోయి వుంది. ప్రభుత్వం నడుపుతున్న ప్రాథమిక పాఠశాలలు, సెకండరీ పాఠశాలలలో సౌకర్యాలు కాదుకదా కనీస సదుపాయాలు కూడా లేక కునారిల్లేట్లు చేశారు. అందుకే పేదలు కూడా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్ళకే పంపుతూ, వారు అన్యాయంగా అధికమొత్తంలో విధిస్తున్న ఫీజులను చెల్లిస్తున్నారు. ఒకవైపు విశ్వ విద్యాలయాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాటిల్లో తగినంతమంది బోధనా సిబ్బంది లేరు. ఎంతో ప్రఖ్యాతిగాంచిన పాత యూనివర్సిటీలు, ఆంధ్రా యూనివర్సిటీ వంటివి కూడా ఆర్థిక సమస్యల నెదుర్కొంటున్నాయి. సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు ప్రైవేటు విద్యలోనే వుంటాయని ప్రచారం చేయబడుతూ వుండగా, జీవిత వాస్తవికత దీనికి భిన్నంగా వుంది. రీఎంబర్స్‌మెంటు పథకం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగు కాలేజీలు, మెడికల్ కాలేజీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. సాధారణ సైన్సు గ్రూపులలోను, హ్యుమానిటీస్ గ్రూపుల్లోను విద్యార్థులు చేరటంలేదు. మరోవైపు బ్యాంకుల్లో అటెండర్ పోస్టులకు, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు కూడా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు పోటీపడుతున్నారు. విద్యావ్యవస్థ మొత్తంగా ప్రైవేటు మార్కెట్ శక్తులకు లాభాలు సమకూర్చే పరిశ్రమగా మారిపోయింది. యువత నిరుద్యోగ సమస్య నెదుర్కొంటోంది. వారి ఆకాంక్షలను తీర్చగలిగే స్థితిలో సమాజం లేదు.

**వైద్య, ఆరోగ్య రంగం**

ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడటం, వారి కవసరమైన వైద్య సదుపాయాలు కల్పించటం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రభుత్వం ఈ బాధ్యత నుండి పూర్తిగా వైదొలగింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు ఎంత అరాకొరగా వున్నప్పటికీ పేదప్రజలు పెద్దసంఖ్యలో వాటికి వెళుతున్నారంటే కారణం పేదలకు అది మాత్రమే అందుబాటులో వుండటం. రోగులు ఎంత డబ్బు వెచ్చించగలరనే దాన్నిబట్టి వాళ్ళకు చేయాల్సిన చికిత్స నిర్ణయమౌతుంది. ప్రభుత్వం ఒక్కొక్కరికి రు.5770 చొప్పున వైద్యానికి ఖర్చు చేసినట్లు రాష్ట్రప్రభుత్వం చెబుతున్నది. కానీ ప్రస్తుతం అది 90% తగ్గిపోయింది. 5330 కోట్లు ఖర్చుపెట్టి 4 సం॥లలో 12 లక్షలమందికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సను అందించినట్లు ప్రభుత్వం చెబుతోంది. 80% పైగా ఆరోగ్యశ్రీ కేసులు ప్రైవేటు ఆసుపత్రులద్వారా చికిత్స పొందినవే. అంటే ఆరోగ్యశ్రీ కొరకు ఖర్చుచేసిన నిధుల్లో 80% ప్రైవేటు ఆసుపత్రులకే పోతోంది. ఉద్యోగస్తుల కందించే వైద్యసేవలు కూడా ప్రైవేటు ఆసుపత్రులకే మళ్ళుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రులకు పడ్డ బకాయిలను చెల్లించటంలో ఆలస్యం జరిగితే (తరచుగా ఇవి 50 కోట్ల రూ॥వరకు వుంటాయి) ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలకు వైద్యం చేయటం నిలిపివేస్తాయి. అంటే ప్రైవేటు వైద్యసేవలలో తీవ్ర అనిశ్చితి నెలకొని వుంది.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి**

తెలుగుదేశం పార్టీ, దాని నాయకులు విభజన ఫలితంగా రాష్ట్ర ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిందని అదేపనిగా మాట్లాడు తున్నారు. కేంద్రప్రభుత్వంతోను, తెలంగాణా ప్రభుత్వంతోను సంప్రదింపులు జరిపి ఈ పరిస్థితినుండి బయటపడాలని వారేనాడూ అనుకోలేదు. ప్రజలనుండి వాస్తవ పరిస్థితులను మరుగుపరిచేందుకు కేంద్రం, రెండు తెలుగు రాష్ట్రాలు ప్రాంతీయాభిమానాలను రెచ్చ గొట్టటంలో ఎక్కువ ఆసక్తిని ప్రదర్శించాయి. ఈ కారణంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోంది. జిఎస్టీకి ముందు వాణిజ్యపన్నుల వసూళ్ళు 10,000 కోట్ల రూపాయలు. ఈ సంవత్సరం రాష్ట్రంనుండి జిఎస్టీ వసూళ్ళు 49,000 కోట్ల రూ॥పైగా పెరిగాయి. అదేవిధంగా లిక్కర్ అమ్మకాలు 2014-15లో 11,482 కోట్ల రూ॥లు వుండగా ఈ సంవత్సరం 17,212 కోట్ల రూ॥. అంటే పెరుగుదల 6 వేల కోట్ల రూ॥లు వరకు వుంది. అలాగే పెట్రోలియం ఉత్పత్తులపై అమ్మకం పన్ను 2014-15లో 3250 కోట్ల రూ॥ వుండగా అది 2017-18లో అది 6586 కోట్ల రూ॥లుగా వుంది. ఈవిధంగా రాష్ట్రంనుండి వచ్చే రెవెన్యూ వసూళ్ళు 2014-15లో 39,907 కోట్ల రూ॥లు కాగా, 2018-19లో అది 65,535 కోట్లకు చేరింది. ఆవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మనిషి మీదా 14వేల రూ॥ అదనపు పన్నుభారం రాష్ట్రవిభజన అనంతరం మోపబడింది.

oooo